
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 1 అక్టోబరు 2025

ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

- కోడ్ అమలు కోసం మండలానికి ముగ్గురు అధికారులు
- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా లో నిర్వహించే ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల నిర్వ హణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కు మార్‌సింగ్ కోరారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్య లు, నామినేషన్ల ప్రక్రియ, పరిశీలన, ఖర్చుల వివరాలు, ఎన్నికల నిబంధనలు తదితర అంశాలపై అధికారులు, నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియామవళిని ప్రతీ ఒక్కరు పాటించాలని లేనట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నియమావళి అమలు కోసం ప్రతి మండలానికి ముగ్గురు చొప్పున అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి వీడియో వింగ్, తదితర ఎన్నికల నిర్వహణ కమిటీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ అధికారులు, ప్రత్యేక తనిఖీ బృందాలు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలును ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎక్కడైనా నియమావళిని ఉల్లంఘిస్తే వెంటనే నిబంధనల ప్రకారం చర్యలుం టాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచిం చిన ప్రకారం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్‌కుమార్, వివిధ పార్టీల నాయకులు సురేష్‌నాయుడు, మార్నేని వెంకన్న, కె.శ్యామ్‌సుందర్, మాలోత్ బాబు, పి.బి.రామారావు, టి.సం దీప్, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీపీవో హరిప్రసాద్, కలెక్టరేట్ ఏవో పవన్ కుమార్, పర్యవేక్షకులు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అటు కుక్కల వేట.. ఇటు కోతుల గోల



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో రోడ్డుపై ఉన్న కుక్కలు

- రోడ్ల వెంట వెళితే తీవ్రంగా దాడి చేస్తున్న వైనం
- పల్లెలు.. పట్టణాల్లో జనం బెంబేలు
- గ్రామాల్లో రైతుల పంటలను ధ్వంసం చేస్తున్న కోతులు
- జిల్లాలో వానరాల దాడిలో 1924.. శునకాల కాటుకు 7630 మందికి గాయాలు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు కుక్కలు.. మరోవైపు కోతులు ప్రజలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పల్లెలు.. పట్టణాలు ఇలా ఎక్కడ చూసినా కోతులు.. కుక్కలు గుంపులు, గుంపులుగా ఉంటూ ప్రజలను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. రోడ్డు వెంట నడిస్తే చాలు చిన్నా పెద్ద అని తేడా లేకుండా వెంట పడి మరి కరుస్తున్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో ఎక్కడో ఒకటి ఉండేది...అలాంటిది ఇప్పుడు ఏపల్లెలో.. ఏ పట్టణంలో చూసిన కోతులు, కుక్కలు గుంపులు, గుంపులుగా దర్శనమిస్తున్నాయి. అవి విపరీతంగా పెరగడంతో రోడ్ల వెంట విచ్చల విడిగా తిరుగుతూ జనాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి. మహబూబాబాద్ పట్టణంలో కొద్ది రోజుల క్రితం రోడ్డు వెంట వెళ్తున్న మెడికల్ షాపు యాజమాని వెంకట్ తల పై కోతి దూకి తీవ్రంగా గాయపరచడంతో రక్త స్రావమైంది. రెండు రోజుల క్రితం పాత బజారులో మహిళపై కోతులు దాడి చేసి గాయపర్చాయి.

కోతుల దాడిలో 1924... కుక్క కాటుతో 7630 మందికి గాయాలు...

జిల్లా వ్యాప్తంగా నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు (ఎనిమిది నెలల కాలంలో) కోతులు 1924 మందిని గాయపర్చగా, కుక్కకాటుకు 7630 మందికి గురయ్యారు. అంటే వాటి దాడులు ఏవిధంగా ఉన్నాయో అర్థమవుతుంది. ఇటీవల కాలంలో రాష్ట్రంలో అక్కడక్కడ కుక్క కరిచిన వ్యక్తులకు రేబిస్ వ్యాధి సోకి మృత్యువాత పడ్డ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంతే కాకుండా కుక్కలు చిన్నారులను గాయపర్చి లాక్కెళ్లిన సంఘటనలు కోకోల్లలు. కుక్కలు, కోతులు గాయపర్చిన వారు నిత్యం ఆస్పత్రులకు వెళ్తున్నారు. జిల్లాలో నిత్యం ఎక్కడా చోట కోతి, కుక్క కాటుకు గురైన వారు ఉంటురన్నారంటే వాటి వల్ల ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో అర్థమవుతుంది.

రోడ్డు వెంట వెళ్లాలంటే భయం..భయం..

కోతులు, కుక్కల బెడదతో రోడ్డు వెంట ఒక్కరు వెళ్లాలంటే భయం. భయంగా వెళ్లాల్సి వస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో వీధుల్లోకి పని మీద వెళ్లాలంటే ఇద్దరు.ముగ్గురు కలిసి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందంటే ప్రజలు ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఉదయం వేళల్లో పిల్లలు బడికి వెళ్లే సమయంలో.. తిరిగి సాయంత్రం పాఠశాల ముగిశాక ఇంటికి వచ్చే సమయంలో పిల్లల వెంట పెద్దలుండి తీసుకొస్తున్నారు. లేకుంటే చిన్న పిల్లల వెంట పడి మరి కరుస్తున్నాయి. ఈక్రమంలో చిన్నారులు రోడ్డు మీదకు (మిగతా 8వ పేజీలో)

కోతులు.. కుక్కలతో ప్రజలకు ఇబ్బందులు



గ్రామాలు, పట్టణాల్లో ఎక్కడా చూసిన కోతులు, కుక్కలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. రోడ్డు వెంట ఒక్కరు నడిస్తే చాలు చిన్నారుల నుంచి మొదలకుని వృద్ధుల వరకు కోతులు, కుక్కలు వెంట పడి కరుస్తూ గాయపరుస్తున్నాయి. ప్రతి నిత్యం కోతులు, కుక్కలు ప్రజలను గాయ పర్చిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వాటి నివారణకు పాలకులు, అధికారులు కృషి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

గంధసిరి రమేష్, నర్సింహులపేట



కేయూలో పీజీ కోర్సుల అడ్మిషన్ల సందడి

8 వరకు మొదటి దఫా అడ్మిషన్లకు అవకాశం..

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంటీఎం, సైకాలజీతో పాటు ఇతర పీజీ, డిప్లొమా కోర్సుల మొదటి దఫా అడ్మిషన్ల సందడి నెలకొంది. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా సీపీసెట్-2025లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన అభ్యర్థులకు వర్సిటీల వారిగా సీట్ల కేటాయింపు ప్రక్రియ జరుగుతోంది. వర్సిటీ క్యాంపస్‌లో మొదటి విడత సీట్లు సాధించిన విద్యార్థులు వర్సిటీ క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయంలో అడ్మిషన్లు పొందుతున్నారు. సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 8 వరకు మొదటి విడత అడ్మిషన్లు జరుగుతాయని కేయూ క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్ తెలిపారు. అభ్యర్థులు తమ వివరాలను స్వయంగా సెల్‌ఫోన్‌లో నమోదు చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి అడ్మిషన్లు పొందాలని వెల్లడించారు. విద్యార్థుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలు ఉంటే క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి లబ్ధిదారుల గృహ ప్రవేశం

అడ్డుకున్న పోలీసులు - అర్హులకు ఇవ్వాలని ధర్నా



ఇళ్లలోకి గృహ ప్రవేశం చేస్తున్న లబ్ధిదారులు

తొర్రూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్మించి ఉన్న 284 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో లబ్ధిదారులు కొన్ని రోజులుగా దీక్ష చేపట్టారు. మంగళవారం ఇళ్లలోకి కొబ్బరికాయలు కొట్టి గృహప్రవేశం చేశారు. పోలీసులు వారిని ఇళ్ల నుంచి బయటకు పంపించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా అర్హులకు నిర్మించిన ఇళ్లు అందించాలని దీక్ష చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఇళ్ల కేటాయిం చాలని డిమాండ్ చేశారు. అధికారులు కేటాయించక పోయినా లబ్ధిదారులు ఇళ్లలో నివాసం ఉంటారని సంబంధిత అధికారులు స్పందించి పట్టాలు అందజే యాలని కోరారు. మిగిలిన అర్హులకు ఇండ్లు ఇవ్వక పోతే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎండీ యాకూబ్, యాకయ్య, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు.. నిబంధనలు ఇవే..



మహబూబాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు ప్రకటించింది..

- ఏ పార్టీ లేదా అభ్యర్థి కానీ ప్రస్తుతం నెలకొన్న విబేధాలను తీవ్రతరం చేయడం, పరస్పరం ద్వేషబావాల్ని సృష్టించడం, కులాలు, మతాలు, భాషల మధ్య విబేధాలు సృష్టించే కార్యకలాపాల్లో పాల్గొనద్దు.
- జాతి, మతం, కులం, ప్రాంతం ప్రాతిపాదికగా ఓటు వేయమని కోరొద్దు.
- ఎన్నికల ప్రచారానికి ప్రార్థనా మందిరాలైన దేవాలయం, మసీదు, చర్చి లాంటి ప్రదేశాలను వేదికలుగా వాడుకోరాదు.
- ఒక అభ్యర్థి ప్రజా జీవితానికి సంబంధంలేని వ్యక్తిగత విషయాలు గానీ, వాస్తవాలను రూడీ పరుచుకోకుండా ఎలాంటి వ్యక్తిగత ఆరోపణలు చేయరాదు.
- ఒక రాజకీయ పార్టీపై విమర్శలు చేసేటప్పుడు అవి పార్టీ విధానాలకు, కార్యక్రమాలకు గత చరిత్రకు మాత్రమే కట్టుబడి ఉండాలి. అంతే గాని వాస్తవాలు తెలుసుకోకుండా ఎలాంటి నిరాదార ఆరోపణలు చేయొద్దు
- పోటీ చేయు అభ్యర్థుల వ్యక్తిగత నివాసాల వద్ద వారి అభిప్రాయాలకు లేదా కార్యకలాపాలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు లేదా పికెటింగ్‌లు ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించరాదు.
- ఒక ప్రైవేటు, ప్రభుత్వ భవనాన్ని ఆ భవన యజమాని, సంబంధిత అధికారి నుంచి రాతపూర్వకంగా ముందస్తు అనుమతి పొందకుండా ఆ భవనంపై ఏ పార్టీ గాని అభ్యర్థి గాని, వారి అనుచరులు గాని పార్టీ, అభ్యర్థి జెండాను పాతడానికి నోటీస్, పోస్టర్లు అతికించడానికి, స్లోగన్‌లు రాయడం చేయొద్దు. ఒక వేళ ఈ విషయంలో తగు అనుమతి పొందినట్లయితే అట్టి రాతపూర్వకమైన అనుమతి పత్రం కాపీని వెంటనే సంబంధిత ఎన్నికల అధికారికి పంపించాలి.
- ఒక అభ్యర్థి లేదా రాజకీయపార్టీ వారి అనుచరులు ఎగురవేసిన జెండాను లేదా అంటించిన పోస్టర్లను ఏ ఇతర అభ్యర్థి లేదా అతడి అనుచరులు తొలగించరాదు.
- ఎన్నికల చట్టం ప్రకారం అవినీతి, నేరాలుగా ఉన్న అన్ని కార్యకలాపాలకు అన్ని రాజకీయపార్టీలు, అభ్యర్థులు, తప్పనిసరిగా దూరంగా ఉండాలి.
- జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగియడానికి 48 గంటల నుంచి ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు.
- ఓటర్లకు ఏ రూపంలో నైనా లంచం లేదా రివార్డులు ఇవ్వ చూపడం నేరం.
- పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల పరిధిలో ఓట్ల కోసం ప్రచారం చేయడం.. లేదా విజ్ఞప్తి చేయొద్దు

ముగ్గురు సంతానం ఉంటే అనర్హులే..

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 31 మే 1995 సంవత్సరం కంటే ముందు ఇద్దరు సంతానం కంటే ఎక్కువ సంతానం కలిగిన అభ్యర్థులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంది. త్వరలో జరగబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలో పొందుపరిచి ఉంది.

జీవోల పండుగ

- కేసముద్రంలో పోలీస్ సర్కిల్
- ఇనుగుర్తిలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, నూతన పోలీస్‌స్టేషన్
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కేసముద్రం పోలీస్‌స్టేషన్



జీవోల విడుదలపై కేసముద్రంలో బాణాసంచా కాలుస్తున్న మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు

కేసముద్రం/ఇనుగుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం, ఇనుగుర్తి మండలాలకు దసరా పురస్కరించుకొని ఒక రోజు ముందే జీవోలతో పండుగ ప్రారంభమైంది. కేసముద్రంలో నూతన పోలీస్ సర్కిల్‌తోపాటు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతేకాకుండా రూ.45.15కోట్లతో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)ని ఇనుగుర్తిలో ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలతో నూతన పోలీస్ సర్కిల్ ఏర్పాటు కాబోతోందని ఈ ఏడాది మార్చి 26న 'ఆంధ్రజ్యోతి'లో 'పోలీస్ సర్కిల్‌గా కేసముద్రం?' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ కథనంలో పేర్కొన్నట్లుగానే ఈ మూడు మండలాలతో సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి రవిగుప్తా జీవో నెంబర్ 117ను విడుదల చేశారు. నూతన పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బందిని సర్దుబాటు చేయాలని తదుపరి పోస్టుల మంజూరు ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు.

ఎట్టకేలకు ఇనుగుర్తి పోలీస్‌స్టేషన్..

ఇనుగుర్తి నూతన మండలంగా ఏర్పాటైన నాటి నుంచి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం నూతన ఇనుగుర్తి మండలంలోని 13 గ్రామాలతో 'ఎఫ్' కేటగిరి పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర హోంశాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి రవిగుప్తా జీవో నెంబర్ 116ను విడుదల చేశారు. నూతన మండలం, తక్కువ విస్తీర్ణం, నేరాల సంఖ్యతో ఉన్న ప్రాంతాల్లో తొలుత 'ఎఫ్' కేటగిరి పోలీస్‌స్టేషన్‌ను మంజూరు చేస్తారని సమాచారం. ఆ తర్వాత పరిస్థితిని బట్టి కేటగిరిని పెంచుతారని తెలుస్తోంది. శాశ్వత పోస్టులు మంజూరయ్యేంత వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉన్న అధికారులు, సిబ్బందితో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నాయి.



ఈ ఏడాది మార్చి 26న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

రాష్ట్రంలో ఆరు మంజూరు.. ఒకటి ఇనుగుర్తికి..

యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ)లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. తాజాగా కార్మిక ఉపాధి శిక్షణ , కర్మాగారాల శాఖ నుంచి ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ జీవో 20ని విడుదల చేశారు. ఇందులో భాగంగా ఐటీఐ కళాశాల మాదిరిగా టాటా టెక్నాలజీస్ సహకారంతో ఉన్నత ఉపాధి కోసం యువతకు నైపుణ్యం కల్పించడానికి ఏటీసీని ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకు ప్రణాళికలు సైతం సిద్ధమవుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ఆరు మంజూరు కాగా అందులో ఒకటి ఇనుగుర్తి కావడం విశేషం. దసరా పండుగను పురస్కరించుకొని వరుసగా మూడు జీవోలు విడుదల కావడంతో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు కేసముద్రంలో మంగళవారం బాణాసంచా కాల్చి, సీఎం, పలువురు నేతల చిత్రపటాలకు పాలాభిషేకంతో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి చొరవతో కేసముద్రం ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.



డిగ్రీ కళాశాలలోని తరగతిగదిని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

ములుగు కలెక్టరేట్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో స్ట్రాంగ్‌రూం ఏర్పాటు కోసం ములుగు కలెక్టర్ టీఎస్. దివాకర అధికారులతో కలిసి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూం ఏర్పాటుకు కిటికీలు, వెంటిలేటర్లను పూర్తిగా మూసివేయాలన్నారు.

స్ట్రాంగ్‌రూంకు రంగులు వేయాలని, విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమెరాలు అమర్చాలని, నిరంతరం పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీపీవో దేవరాజ్ తదితరులు ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ బహుమతి



అశ్వతేజ్‌రెడ్డి

చిలుపూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి గుంపుల అశ్వతేజ్‌రెడ్డి జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ బాలుర విభాగం బాల్ బ్యాడ్మింటన్‌లో తృతీయ బహుమతి సాధించారు. ఈనెల 25 నుంచి తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్‌లో 44వ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. తెలంగాణ జట్టు నుంచి పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సంపాదించాడు. జఫర్‌ఘడ్ మండలంలోని కూనూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయ బృందంతోపాటు, గ్రామస్థులు అశ్వతేజ్‌రెడ్డి అభినందించారు.

జాతీయ ఫుట్‌బాల్ టోర్నీకి గురుకుల విద్యార్థి



గిరీష్ వర్ధన్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఎం.గిరీష్ వర్ధన్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబరు 5 నుంచి 8 వరకు జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ రఘుపతి, పీడీ గుంటి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రవీందర్, జయధర్ పాల్గొన్నారు.

12యూనిట్ల రక్తం సేకరణ



ప్రశంసాపత్రాలతో రక్త దాతలు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రక్తదాన వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరంలో 12యూనిట్ల రక్తాన్ని సేకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ జనగామ మిలీనియం పూర్వ రీజియన్ చైర్మన్ శ్రీరాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం జనగామ వీవర్స్ కాలనీలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ వైద్యులు పగిడిపాటి కరుణాకర్‌రాజు, మోర్తాల దివ్య, క్లబ్ ప్రతినిధులు పిల్లలమర్రి ఉదయ్, గుర్రం అనిల్‌గౌడ్, హరిగౌడ్, ఎనగందుల కృష్ణ, బిట్ల అనిల్, చిదురాల కృష్ణ, బొంతపల్లి నాగరాజు, భీమనాదం హరీష్, తౌటం సురేష్, బొంతపల్లి చిన్న, బుదారపు రమేష్, గర్దాసు గణేష్, ఏనుగు నర్సిరెడ్డి, బిట్ల నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రూపొందించిన కార్డును చూపిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలు కావస్తున్నా ఎన్నికల హామీలు నెరవేర్చడంలో విఫలం చెందిందన్నారు. 22 నెలల్లో అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం ఎంత బాకీ పడిందో ఓ కార్డును రూపొందించామన్నారు. ఈ కార్డు ద్వారా ప్రజలకు తెలియజేయాలన్నారు. స్థానిక ఎన్నికలకు ఓటు కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీసేలా చైతన్యం తీసుకరావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మద్దతుతో పోటీ చేసే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రూరల్ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డి, నాయకులు మందల విద్యాసాగర్‌రెడ్డి, పొల్సాని లక్ష్మీనరసింహారావు, పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు
- స్వల్పంగా గాయపడిన 11 మంది





ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు, కారు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి బాంబులగడ్డ సమీపంలో మంగళారం జరిగింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒకరు, బస్సులో ఉన్న మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అదే కారులో ఉన్న మరో ఇద్దరితోపాటు బస్సులో ఉన్న 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికులు, పోలీసులు, ఆర్టీసీ డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకా రం.. భూపాలపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు రోజువారీ ట్రిప్పుల్లో భాగంగా మంచిర్యాలకు బయల్దేరింది. ఈ క్రమంలో భూపాలపల్లి మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన దండిగ సాయికృష్ణ, తన బంధువు గజ్జి అఖిల్‌తోపాటు మరో వ్యక్తి కారులో భూపాలపల్లికి వస్తున్నాడు. మార్గమధ్యలో బాంబులగడ్డ సమీపంలో కోతులు ఎదురుగా రావడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దీంతో కారు నడుపుతున్న సాయికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అదే కారులో ఉన్న గజ్జి అఖిల్‌తోపాటు మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డారు. అలాగే బస్సులో ముందు సీటులో కూర్చున్న మహిళ తలకు తీవ్రం గాయమైంది. బస్సులో ఉన్న మరో తొమ్మిది మంది స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న భూపాలపల్లి పోలీసులు, ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందు ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద పరిస్థితిని ఆరా తీశారు. ఆర్టీసీ డ్రైవర్ అప్రమత్తతో వ్యవహరించడంతోనే పెను ప్రమాదం తప్పిందని తెలుస్తోంది. ఈ జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

● కుటుంబ కలహాలే కారణమా? ● శివునిపల్లిలో విషాదం



తొరివి అశ్విని (ఫైల్), అశ్విని మృతదేహం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జనగామ జిల్లా శివునిపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.

శివునిపల్లికి తొరివి అశ్విని(41) మోహన్‌శర్మ దంపతులు. వీరికి కుమారుడు ఉన్నాడు. మోహన్‌శర్మ పౌరోహిత్యం చేస్తుండగా, అశ్విని గృహిణి. రోజు మాదిరిగానే పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయానికి మోహన్‌శర్మ వెళ్లి పూజ కార్యక్రమాలు ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. మొదట అశ్విని బెడ్‌రూంలో నిద్రిస్తోందని భావించాడు. కాసేపటికి బెడ్‌రూం తలుపు తెరిచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. లబోదిబోమంటూ స్థానికుల సాయంతో కిందకు దించాడు. అప్పటికే అశ్విని మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎస్సైలు వినయ్‌కుమార్, మనీషాలు అక్కడికి చేరుకొని విచారణ చేపట్టి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, వివాహిత మృతికి గల కారణాలు తెలియరాలేదు. కుటుంబ కలహాలే కారణమై ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

జిల్లాలో 496 లూజ్‌లైన్లు

- 227 వంగిన విద్యుత్ స్థంబాల మరమ్మతులు
- జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలో విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం ద్వారా ప్రమాద భరితంగా ఉన్న లూజు లైన్లు, వంగిన విద్యుత్ స్థంబాలను, మధ్య స్తంభాలను పునరుద్ధరించినట్లు జిల్లా విద్యుత్‌శాఖ అధికారి విజేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 492 లూజులైన్లు, 227 వంగిన స్థంబాలు, 479 మధ్య స్తంభాలను సరిచేయడం జరిగిందన్నారు. రైతులకు ట్రాన్స్‌ఫారాలు, ఓవర్‌లోడ్ సమస్యలను తీర్చడానికి ఎక్కడైతే ఓవర్‌లోడ్ అవుతున్న ట్రాన్స్‌ఫారాలను ముందే గుర్తించి వాటి సామర్థ్యాన్ని పెంచి ఓవర్‌లోడ్ సమస్యను తీర్చనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ :1912కు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

పండగ వేళ గొడవలు సృష్టిస్తే ఊపేక్షించం

- భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు



మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ వేళ ఎవరైనా గొడవలు సృష్టిస్తే ఊపేక్షించబోమని, కేసులు నమోదు చేస్తామని భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు హెచ్చరించారు. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఖాశీంపల్లిలో మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఆరు మండలాల్లో ప్రశాంతంగా జరిగిందన్నారు. ఖాశీంపల్లిలో చిన్న గలాటా జరిగిందన్నారు. అలాంటివి మళ్లీ ఏమైనా గొడవలు సృష్టిస్తే చర్యలు తప్పవని అన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. అనవసర పంతాలకు పోయి ఎవరూ కేసుల పాలు కావద్దన్నారు. అంతకు ముందు గ్రామంలో సోదాలు చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, సతీష్, ఉమెన్ ఎస్సై రవళి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకన్న (ఫైల్)

పాలకుర్తి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి, నాంచారిమడూరు ప్రధాన రహదారిపై సిరిపన్నగూడెం శివారులోని కంబాలకుంట బస్‌స్టేజీ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దర్దెపల్లికి చెందిన తాళ్లపల్లి వెంకన్న గౌడ్ (37) కులవృత్తి చేసుకుని జీవిస్తున్నాడు. మోటార్ సైకిల్‌లో పెట్రోల్ పోయించుకునేందుకు మల్లంపల్లి శివారులోని పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి, తిరిగు తిరుగుముఖం పట్టాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో కిందపడ్డ వెంకన్న తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకన్న భార్య పది రోజుల క్రితం కుమారుడికి జన్మనిచ్చింది. కుమారుడి ఆలనా పాలనా చూడకుండానే వెంకన్న మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడు తండ్రి కుమారస్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

లారీ ఢీకొని హెడ్ కానిస్టేబుల్ మృతి

పరకాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్‌ను కంకర లారీ బలిగొన్న ఘటన పరకాల మండలం కామారెడ్డిపల్లి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ (58) పరకాల పోలీసు స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం డ్యూటీ ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో కామారెడ్డిపల్లి వద్ద మాందారిపేట నుంచి పరకాల వైపు వెళుతున్న కంకర లారీ గొర్రెల మందను తప్పించబోయి కొర్లకాపరి పాలకుర్తి సాంబయ్యను ఢీకొట్టి హెడ్ కానిస్టేబుల్ ద్విచక్రవాహనాన్ని సైతం ఢీకొట్టి పల్టీకొట్టింది. ఈ ఘటనలో సాంబయ్య స్వల్పంగా గాయపడగా, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పరకాల ఎస్ఐ విఠల్, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ మృతి చెందాడు. దీంతో పరకాల పోలీసు స్టేషన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

శ్రామిక రాష్ట్ర మహిళ సదస్సును విజయవంతం చేయాలి

సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి మాధవి



సదస్సు వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర మహిళ కార్యదర్శి మాధవి

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా శ్రామిక మహిళలు ఎదుర్కొంటు న్న సమస్యలపై అక్టోబరు 5, 6వ తేదీల్లో కాగజ్‌నగర్‌లో నిర్వహించతలపెట్టిన శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ శ్రామిక మహిళ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి ఎస్.రజిత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు మాధవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా రాష్ట్ర సదస్సు వాల్ పోస్టర్‌ను మాధవి ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు.

శ్రామిక మహిళలపై పనిచేసే ప్రదేశాల్లో హింస, అత్యాచారాలు, యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులను అరికట్టాలన్నారు. సమాన పనికి సమాన వేతనం తో పాటు కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. శ్రామిక మహిళ లు గౌరవ ప్రదమైన జీవనం కొనసాగించడానికి అన్ని రకాల రక్షణ చర్యలు ప్రభుత్వం తీసుకోవాలన్నారు. చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ల కోసం దేశ వ్యా ప్తంగా సీఐటీయూ నిరంతర ఉద్యమాన్ని చేపట్టనున్నామని మాధవి హెచ్చరించారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల ఎజెండాలో ఫైఅంశాలను చేర్చకపోవడం శోచనీయంగా ఉందన్నారు. శ్రామిక మహిళల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వము తక్షణమే పరిష్కరించాలని మాధవి కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు కనీస వేతనాలు అమలు చే యడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. మహిళా సాధికారత ప్రధాన లక్ష్యం అని పదే పదే చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. మహి ళా వర్కర్ల చేత వెట్టిచాకిరీ ఎందుకు చేపిస్తున్నారో చెప్పాల్సిన అవసరం ఉందని రమేష్ అన్నారు. సదస్సులో హైమావతి, కె.జమున, శోభారాణి, కె.రమాదేవి, యాకూబీ, లీల పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్ వద్ద బాధితుల ఆందోళన

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని అక్షర చిట్‌ఫండ్ కార్యాలయం వద్ద చిట్టీదారులు మంగళవారం ఆందోళనకు దిగారు. డిపాజిట్లు పెట్టినా డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పెద్ద సంఖ్యలో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. మహిళలు, వృద్ధులు సహా వందలాది మంది ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నారు. చిట్‌ఫండ్ బాధ్యులతో బాధితులకు వాగ్వాదం జరిగింది. సుబేదారీ సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్షర చిట్‌ఫండ్ వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. చిట్‌ఫండ్ నుంచి డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ రాత్రి వరకు ఆందోళన చేశారు.

కన్స్యూమర్ రైట్స్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా నరేశ్

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు, సామాజిక కార్యకర్త డాక్టర్ బారి నరేశ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిషన్ జాతీయ అధ్యక్షుడు సాయి రమేశ్‌గౌడ్, జాతీయ అబ్జర్వర్ రాధాకృష్ణ సంయుక్త తెలిపారు.

యోగా సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

వడ్డెపల్లి, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యోగా డిప్లొమా సర్టిఫికెట్ కోర్సులో చేరేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని హెపీ లివింగ్ అకాడమీ ఫౌండర్, యోగాచార్యులు అంజనేయులు, డైరెక్టర్ మహేశ్ తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హనుమకొండ 56వ డివిజన్‌లోని పోలీసు కాలనీ వద్ద గల సాయి సేవా ట్రస్ట్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కాకతీయ యూనివర్సిటీ సీడీవోఈ ద్వారా ప్రామాణిక సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు సెల్ నెంబర్ 95534 89862, 99126 40919లలో సంప్రదించాలన్నారు.

తగ్గుముఖం పట్టిన గోదావరి



కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ప్రవాహం



వాజేడు మండలంలో వరద నీటిలో మునిగిన మిర్చి పంట

మహదేవపూర్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం త్రివేణి సంగమ కాళేశ్వరం వద్ద మంగళవారం గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వరద తక్కువ కావడంతో కాళేశ్వరం వద్ద 10.04 మీటర్ల ఎత్తుతో గోదావరి ప్రవహిస్తోంది.

● వాజేడు (ఆంధ్రజ్యోతి): మండలంలో గోదావరి తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఉదయం నుంచి గోదావరి వరద ప్రవాహం నెమ్మదిగా తగ్గుతుంది. పేరూరు వద్ద ఉదయం 6గంటలకు 17.370 మీటర్ల నీటిమట్టం ఉండగా 9గంటలకు 17.340 మీటర్లు, మధ్యాహ్నం 12 గంటలకు 17.170 మీటర్లు, 3 గంటలకు 16.990 మీటర్ల నీటిమట్టంకు చేరుకొని తగ్గుముఖం పడుతోందని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. అయితే.. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ టేకులగూడెం వద్ద జాతీయ రహదారి నీట మునిగే ఉంది. ప్రస్తుతం 16.990 మీటర్లు ఉన్న గోదావరి నీటిమట్టం 14మీటర్లకు చేరుకుంటే జాతీయ రహదారిపై వరద నీటి ప్రవాహం తగ్గి రాకపోకలకు అంతరాయం లేకుండా ఉంటుంది. ఇదిలా ఉండగా

గోదావరి వరదలతో మిర్చి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అకస్మాత్తుగా గోదావరికి వరద ప్రవాహం పెరగటంతో ముందే వేసిన మిర్చి నార్లు మునిగిపోయి రైతులకు నష్టం చేకూరింది. మండలంలో సుమారు 400 ఎకరాల్లో మిర్చి పంట వరదలో మునిగిపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

● ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలో రెండు రోజులుగా ఉధృతంగా ప్రవహించిన గోదావరి మంగళవారం క్రమంగా తగ్గుముఖం పట్టింది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా తగ్గుతోంది. సోమవారం రెండో ప్రమాద హెచ్చరిక దాటి పుష్కరఘాట్ వద్ద ప్రవాహం కొనసాగింది. పుష్కరఘాట్ వద్ద ఉదయం 6 గంటలకు 16.110 మీటర్లకు చేరిన నీటిమట్టం ఆ తర్వాత మూడు గంటల పాటు నిలకడగా ఉంది. అనతరం క్రమంగా తగ్గింది. నీటి ప్రవాహం సాయంత్రం 5 గంటలకు 15.860 మీటర్లకు తగ్గడంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించుకోగా మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.


మహిళలతో కిక్కిరిసిన రంగలీల మైదానం


బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు


భద్రకాళి ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూలవనంలా రంగలీల మైదానం


బతుకమ్మతో వస్తున్న మహిళలు

- ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళాలోకం

కరీమాబాద్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల జాతర సద్దుల పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సారి సద్దుల బతుకమ్మ తేదీపై గందరగోళం నెలకొనడంతో సోమవారం కొందరు, మంగళవారం మరికొందరు జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం నగరంలోని ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో వేడుక కన్నుల పండువగా జరిగింది. పించారు. వేలాది మంది మహిళలు తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో రావడంతో రంగలీలా మైదానం పూల జాతరను తలపించింది. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడపడుచులు పాడిన ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. బతుకమ్మ పాటలు పాడి సంప్రదాయబద్ధంగా ఆడి ఉర్సు రంగసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం పసుపు కుంకుమలతో వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గౌరమ్మ రూపమైన పసుపు ముద్దతో మాంగళ్య భాగ్యం కలకాలం నిలవాలని ప్రార్థించారు. ఉత్సవాల్లో మిల్స్‌కాలనీ సీఐ బొల్లం రమేష్, ఎస్సై సురేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ బతుకమ్మను ఏర్పాటు చేశారు. వేడుకల్లో కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్నగౌడ్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, ఇతర కమిటీ సభ్యులు, స్థానిక కార్పొరేటర్‌లు మరుపల్ల రవి, పల్లం పద్మా రవి, ముష్కమల్ల అరుణా సుధాకర్ పాల్గొన్నారు. కాగా, ఈ వేడుకల్లో నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ శాసన సభ్యుడు నన్నపునేని నరేందర్ పాల్గొన్నారు. స్థానిక మహిళలతో బతుకమ్మ ఆటలు ఆడి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.




బందోబస్తులో ఉన్న ఎస్సైకి బొట్టు పెడుతున్న మహిళ


బతుకమ్మతో వస్తున్న హిజ్రాలు


రంగలీల మైదానంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్


బతుకమ్మను చెరువులో వదులుతున్న యువతి

బీసీల రిజర్వేషన్లకు మద్దతివ్వాలి

- మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్లు మంజూరు
- దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ 6పనులకు రూ.1,001కోట్లు మంజూరు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీల రిజర్వేషన్ల అమలుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని పార్టీలు మద్దతివ్వాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం రూ.50 కోట్లు మంజూరి చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నాయకులతో కలిసి మంగళవారం పార్టీ కార్యాలయంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో భాగంగా బీసీ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి, బిల్లు ఆమోదం కోసం గవర్నర్‌కు, కేంద్రానికి పంపినా స్పందించడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పనకు ప్రభుత్వం జీవోను విడుదల చేసి చరిత్రను సృష్టించిందన్నారు. బిల్లును రద్దు చేయాలని కోర్టులకు వెళ్లడం మానుకొని, బీసీలకు మద్దతుగా నిలువాలని కడియం కోరారు. ఈబీసీ రిజర్వేషన్ల అమలు సమయంలో స్పందించని పార్టీలు బీసీ రిజర్వేషన్ల అమలుపై మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

హామీ మేరకు మునిసిపాలిటీగా మార్చాను..

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు స్టేషన్‌ఘన్‌పూర్‌ను మునిసిపాలిటీగా మార్చుతానని మాట ఇచ్చి, నిలుపుకున్నానని కడియం పేర్కొన్నారు. మునిసిపాలిటీగా మారడమే కాకుండా మునిసిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌పై ప్రేమతో రూ.50కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ప్రజల తరుపున సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

దేవాదుల ఫేజ్-3, ప్యాకేజీ-6లో భాగంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 78వేల ఎకరాలకు సాగునీరు అందించడానికి సవరించిన అంచనాలతో ప్రభుత్వం రూ.1,001కోట్ల నిధులు మంజూరి చేస్తూ పరిపాలన పరమైన అనుమతులు ఇచ్చిందన్నారు. నియోజకవర్గానికి ఏం కావాలి, ఏం చేయాలనే ఆలోచనతోనే పని చేస్తున్నట్టు కడియం పేర్కొన్నారు. నియోజకవర్గ రైతులకు సాగు నీరు, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేబడుతున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలిపించుకోవాలని, అందరూ ఒకేతాటిపై ఉంటే అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, మార్కెట్ చైర్‌పర్సన్ జూలకుంట్ల లావణ్య-శిరీష్ రెడ్డి, చిలుపూరు దేవస్థానం చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, గడ్డమీది సురేష్, నాయకులు అంబటి కిషన్‌రాజు, బూర్ల శంకర్, నాగరబోయిన శ్రీరాములు, పోశాల కృష్ణ, మధుసూదన్ రెడ్డి, రాపోలు శివచరణ్ రెడ్డి, కుందూరు వెంకట్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నీల గట్టయ్య, తెల్లాకుల రామకృష్ణ, రజాక్‌యాదవ్, నాగరబోయిన యాదగిరి, యార సెల్ కొమురెల్లి, గట్టు ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఎత్తిన బాషా దంపతులు

వరంగల్‌సిటీ, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 14వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక ముస్లిం మైనారిటీ నాయకుడు బాషా రజియా దంపతులు బతుకమ్మను ఎత్తుకొని కుటుంబ సమేతంగా వెళ్లి సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బాషా దంపతులు బతుకమ్మను రంగురంగుల పూలతో అలంకరించి నెత్తిన ఎత్తుకుని వేడుకల వద్దకు వెళ్లారు. బాషాను చూసి అందరూ ఆప్యాయంగా పలకరించారు. అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా బాషా మాట్లాడుతూ.. కుల మతాలు అనేవి మనం సృష్టించుకున్నవేనని, అన్ని పండుగలను అందరం కలిసి చేసుకుంటే మత సామరస్యం వెల్లివిరుస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.


ఇందిరమ్మకాలనీలో కుటుంబ సభ్యులతో బతుకమ్మను ఎత్తుకుని వస్తున్న బాషా

రోకలిబండతో కొట్టి..

- భార్యను హత్య చేసిన భర్త
- మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడంతో దారుణం

చిట్యాల, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : క్షణికావేశంలో భార్యను భర్త రోకలిబండతో కొట్టి హత్య చేసిన ఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిరుమలపురం గ్రామంలో కనుకుంట్ల ప్రమీల (50), లింగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు. ఇంటి వద్దే ఈ దంపతులు పిండి గిర్నీ నిర్వహిస్తున్నారు. దీనికి తోడు లింగయ్య టైలర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా లింగయ్య మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం కూడా లింగయ్య మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. ఆమె ఇవ్వడానికి నిరాకరించింది.


ఘటన స్థలంలో ప్రమీల మృతదేహం

ఈ క్రమంలో బయటకు వెళ్లొచ్చిన లింగయ్య ఆ కోపంతో భార్యతో గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య తీవ్రంగా వాగ్వాదం జరిగింది. దీంతో క్షణికావేశానికి గురైన లింగయ్య భార్య ప్రమీలపై దాడి చేశాడు. రోకలిబండతో తలపై పలుమార్లు కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. చుట్టుపక్కల వారు గమనించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న సీసీ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం చిట్యాల సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతురాలి చిన్న కుమారుడు సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొండెక్కిన మటన్

- దసరా పండుగ వేళ రూ.వెయ్యికి చేరిన కేజీ ధర
- రూ.10 వేల నుంచి 20వేలు పలుకుతున్న పొట్టేలు
- ఐదేళ్ల తర్వాత పెరిగిన రేట్లు

శంభునిపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చిందంటే చాలు సుక్క, ముక్క ఉండాల్సిందే. దసరా పండుగకు మటన్‌కు యమ క్రేజ్ ఉంటుంది. పొట్టేళ్ళ మాంసానికి మరీ ఎక్కువ డిమాండ్ ఉండటంతో మార్కెట్‌లో వాటి ధరలు విపరీతంగా పెరిగాయి. పది కేజీల మాంసం ఉండే పొట్టేలు ధర సంతల్లోనే రూ.10 వేల నుంచి రూ.14 వేలు పలుకుతోంది. దీంతో మాంసం ధరలు అమాంతం పెరిగి జిల్లాలో తొలిసారి మటన్ కిలో రేటు రూ.1000కి చేరింది. ఐదేళ్ళ క్రితం 900 పలికిన మటన్ ధర, ప్రస్తుతం రూ.వెయ్యి పలుకుతోంది. 2018లో రూ.800, 2021లో రూ.900 అమ్మగా ప్రస్తుతం 2025లో రూ.1000 చేరింది.

పొట్టేళ్ళ కొరత..

మటన్ అంటే మాంసం ప్రియులు అమితంగా ఇష్టపడుతుంటారు. అందులో పొట్టేలు మాంసానికి ఉన్న క్రేజే వేరు. అయితే మార్కెట్‌లో డిమాండ్‌కు తగిన పొట్టేళ్ళ ఉత్పత్తి లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొమ్మాల, పాలకుర్తి, రఘునాథపల్లి, తొర్రూర్, జంగాలపల్లి, ముల్కనూరు, నెక్కొండ సంతల్లో పొట్టేళ్ళ క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. వీటికి తోడు గ్రామాల్లోని మందల్లో కొనుగోలు చేస్తుంటారు. కాని ఈ సంతల్లో అమ్మే జీవాలు జిల్లాలోని మాంసాహారులకు సరిపోవడం లేదు. వరంగల్ జిల్లాలో నెలకు సుమారు ఆరు నుంచి ఏడు వేల జీవాలను మాంసం ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పెళ్ళిల్ల్లు, పండుగ సీజన్‌లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుంది. కాని మన జిల్లాలో సగానికి పైగా యాటల ఉత్పత్తి కూడా లేదు. దీంతో మాంసం విక్రయదారులు జిల్లాలోని సంతలే కాకుండా హైదరాబాద్, మిర్యాలగూడ, పెబ్బేరు, అనంతపురం, ఇచ్చోడ, నవీపేట, నాగ్‌పూర్, ఇతర సంతలకు వెళ్ళి పెద్ద సంఖ్యలో జీవాలను కొనుగోలు చేస్తున్నారు.

తెలంగాణతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, రాష్ట్రాల యాటల మాంసం రుచిగా ఉంటుందని అందరూ నమ్ముతారు. అందుకే వాటికి విపరీతమైన డిమాండ్ ఉంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్ ప్రాంతాల నుంచి లారీల్లో జీవాలను తీసుకువచ్చి తెలంగాణలోని పెద్ద సంతల్లో అమ్ముతున్నారు.



గాంధీ జయంతి ఎఫెక్ట్

ఈ సారి దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావటంతో మాంసం దుకాణాలు బంద్ చేస్తున్నట్లు మాంసం విక్రయదారులు తెలుపుతున్నారు. దసరా సంప్రదాయ ఉత్సవాలకు ఆటంకం కలుగకుండా చూస్తామని తెలిపారు. ఆడపడుచుల పండుగ బతుకమ్మ ముగియగానే దసరా సంబురాలు మొదలవుతాయి. ప్రతీ ఇంట్లో మాంసాహారాన్ని వండుకుంటారు. మూడు రోజులు దసరాను జరుపుకుంటామని.. ఈ విషయంలో తగ్గేదేలేదని మాంసం ప్రియులు ముక్త కంఠంతో చెబుతున్నారు.



సూర్యుడి చుట్టూ వలయాకారం

ఆకాశంలోని సూర్యుడి చుట్టూ మంగళవారం మధ్యాహ్నం వలయాకారం కనిపించడంతో పలువురు ఆసక్తిగా తిలకించారు. వారం రోజులుగా వర్షాలు కురవడంతో మేఘావృతమై ఉండి ఆకాశంలో సూర్యుడు కనిపించలేదు. సోమ, మంగళవారాలు ఎండ కాయడంతో మంగళవారం సూర్యుడు కనిపించడం, దాని చుట్టూ ఇంద్రధనస్సులా వలయాకారం కనిపించడాన్ని పలువురు సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, దుగ్గొండి

బీసీ రిజర్వేషన్ల తీరుపై గగ్గోలు

- ఇద్దరు ఓటర్లే ఉన్నా రిజర్వేషన్ కేటాయింపు
- తలలు పట్టుకుంటున్న స్థానిక నేతలు

మరిపెడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తండాకు ఇద్దరే బీసీ ఓట ర్లు ఉన్న ఐదు జీపీలను బీసీలకు కేటాయిస్తూ అధికారులు గెజిట్ విడు దల చేశారు. దీంతో ఆ తండాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల స్థానిక నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఆ రిజర్వేషన్లను సత్వరం రద్దు చేసి ఎస్టీలకు కేటాయించాలని ఆయా తండాల జనం కోరుతున్నారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అజ్మీరాతండా, అమృ తండా, వెంకట్యాతండా, ధరావత్‌తండా, నేతావత్ పర్కాజల్ తండా జీపీ లలో 99.9 శాతం గిరిజనులు ఉన్నారు. ఆ తండా జీపీలను అధికారులు గుడ్డిగా బీసీలకు కేటాయించి చేతులు దులుపుకున్నారు. దీంతో ఆయా తండాల నేతలు తంటాలు పడుతున్నారు.

ఇద్దరే ఓటర్లు

అమృతండా, అజ్మీరాతండా, ధరావత్‌తండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్ తండాలలోని జీపీలలో ఇతర రాష్ట్రలకు చెందిన భార్యాభర్తలు ఆయా జీపీకి ఇద్దరేసి చొప్పున ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వ్యవసాయ పనుల కోసం కూలీలుగా వచ్చి ఉండడంతో అప్పట్లో వారిని ఓటర్లుగా నమోదు చేశారు. అమృతండా, వెంకట్యాతండా, నేతావత్ పర్కాజల్‌తండా, అజ్మీరా తండా జీపీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇద్దరేసి బీసీ ఓటర్లు ఉండగా ఆ తండాల జీపీలను, ఇక ధరావత్ తండాలో నలుగురు ముస్లిం ఓటర్లు ఉండగా దానిని కూడా బీసీలకే కేటాయించారు. 99.9 పైగా ఓటర్లు ఉన్న గిరిజనులకు రిజర్వేషన్ కేటాయించలేదు. బీసీలకు తండా పంచాయతీలను రిజర్వేషన్ చేయడంపై అక్కడి ఓటర్లు ప్రభుత్వ విధానంపై మండి పడుతున్నారు.

జీపీలను ఎస్టీలకు కేటాయించాలి

99.9 శాతంకు పైగా గిరిజన ఓటర్లు ఉన్న తండా జీపీలను బీసీలకు రిజర్వేషన్ చేయడం సరికాదు. ఇప్పటికైనా అధికారులు తమ తప్పులను సరిదిద్దుకుంటే మంచిది. లేకుంటే ప్రభుత్వంపై గిరిజనులు తిరగబడతారు. తండాల్లో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించాలి.



ధరావత్ పద్మ, మాజీ సర్పంచ్, అమృతండా జీపీ



అమృతండా జీపీ కార్యాలయం

తండాలో ఎస్టీల పాలనకు సమాధి చేసే కుట్ర

99.9 శాతం గిరిజన ఓటర్లు ఉన్న తండాలను ఇతర కులాల వారికి కేటాయించడం తమ తండాలో తమ పాలనను సమాధి చేయడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని లంబాడీల ఐక్య వేదిక ఇదివరకే ఆరోపించింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 50 శాతం గిరిజన జనాభా ఉంటే ఎస్టీలకే తండాల జీపీలను కేటాయించిందని గిరిజన సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం తండా జీపీలను తండా వాసులకే రిజర్వు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సత్యనారాయణకు సాహితి కిరీటి పురస్కారం



సత్యనారాయణను సన్మానిస్తున్న శ్రీ శ్రీ కళా వేదిక చైర్మన్ ప్రతాప్ తదితరులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత గుర్రపు సత్యనారాయణను ప్రతిష్టాత్మక సాహితి కిరీటి జాతీయ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. గుర్రం జాషువా 130వ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ సాహితి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏటా కవులు, రచయితలను సన్మానిస్తారు.అందులో భాగంగానే ఈ ఏడాది తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణను శ్రీ శ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం సాహితి కిరీటి పురస్కారంతో సన్మానించి పురస్కారం అందజేశారు. సత్యనారాయణకు సాహతి కిరీటి పురస్కారం రావడంపై పలువురు కవులు, రచయితలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోడు భూముల సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత జి.నాగయ్య

గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గూడూరు మండల కేంద్రంలో సీపీఎం పోడు రైతుల విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జనగం వీరస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నాగయ్య మాట్లాడుతూ.. సాగు చేసుకున్న పోడు భూములకు ప్రభుత్వాలు హక్కులు కల్పించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేసుకున్న రైతులకు ఎలాంటి హక్కుపత్రాలు లేకపోవడం వల్ల పోడు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నుంచి అందాల్సిన రైతుబంధు, రైతుబీమా, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందడం లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రైతులు పండించిన పంటలను అమ్ముకోవడానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పట్టాదార్ పాస్‌పుస్తకాలు లేకపోవడంతో విక్రయించేందుకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం కాసులో ఉన్న రైతులందరికి హక్కు పత్రాలు ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దమొత్తంలో రైతులను సమీకరించి ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, గూడూరు, కొత్తగూడ, గంగారంకు చెందిన రైతులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కమిటీ నూతన కన్వీనర్‌గా జనగం వీరస్వామితో పాటు మరో 18మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు నక్క సైదులు, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, సురేష్, రమేష్, భాగ్యలక్ష్మి, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, మల్లేష్, చంటి, సుమలత, లక్ష్మణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

డంపు చేసిన ఇసుక మాయం ?

- సోషల్ మీడియాలో వైరల్

చిన్నగూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డంపు చేసిన ఇసుక రాత్రికి రాత్రే మాయమైన ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెప్టెంబరు 21న మండలంలోని ఆకేరువాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని స్థానిక పీఎస్‌కు తరలించారు. అనంతరం పీఎస్ వద్ద ఇసుకను డంపు చేశారు. ట్రాక్టర్ యాజమానులు మంగళవారం జరిమానా కట్టి వాహనాలను తీసుకెళ్దామని వచ్చేసరికి ఇసుక మాయమైంది. సీసీ కెమెరా ఉంటే ఇసుక ఏమైనా విషయం బయట పడొచ్చని అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ వైరలయింది. ఈ విషయంపై స్థానిక ఎస్సైని ఫోన్లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కోట్య మృతదేహం

గూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం ఏపూరు శివారు టేకుల తండాకు చెందిన లకావత్ కోట్య (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. టేకులతండాకు చెందిన కోట్య కుటుంబ సమస్యల నేపథ్యంలో మనస్తాపం చెంది తన ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి లకావత్ చాంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య మంజుల, కుమార్తెలు గాయత్రి, గౌతమి, కుమారుడు మహేష్ ఉన్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి మృతి



రమేష్(ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :డోర్నకల్ మండలం హున్యతండా లోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి రమేష్ (61) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. రమేష్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. మృతుడు రమేష్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్ మృతిపట్ల ఎంఈవో లక్ష్మా, జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బండి నర్సింహారావు, చిల్కోడు జడ్పీహైస్కూల్ హెచ్ఎం వీరభద్రం, ఉపాధ్యాయులు తలారి విద్యాసాగర్, విత్తనాల సుధాకర్‌లు సంతాపం వ్యక్తం చేశారు.

గ్రూప్-2 విజేత మధుకు సన్మానం



మధును సన్మానిస్తున్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు

తొర్రూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తొర్రూరులోని రిక్షా కాలనీకి చెందిన ఎన్. మధు గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్‌గా ఉద్యోగం సాధించడంతో మాదిగ ఉద్యోగుల సమాఖ్య మంగళవారం ఆయనను సన్మానించింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమారపు ఐలయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంఈవో బుచ్చయ్య మాట్లాడుతూ రిక్షా కార్మికుడు శంకర్ కుమారుడు గ్రూప్-2లో విజయం సాధించడం అబినందనీయ మన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం అందించే అన్ని రకాల సౌకర్యాలు వినియోగించుకుని కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో నిలవాలన్నారు. లక్ష్యంతో సాధిస్తే ఉద్యోగాలు వస్తాయని, ఎస్సీ వర్గీకరణ ఫలాలు పొందాలంటే మాదిగలు చదువు పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, రంజిత్, రమేష్, వెంకన్న, యాకయ్య, రవీందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తండాల్లో బీసీ రిజర్వేషన్ సరికాదు

- సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ వెంకన్ననాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్ననాయక్

నెహ్రూసెంటర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన తండా పంచాయతీల్లో స్థానిక సంస్థల రిజర్వేషన్ బీసీలకు కేటాయించడం సరికాదని సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దారావత్ వెంకన్ననాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతండాలో.. మా రాజ్యం.. మేమెంత మందిమో.. మా కంత వాటాను పోరాడి సాధించుకున్న గిరిజనతండా పంచాయతీల్లో ఇతర వర్గాలకు రిజర్వేషన్లు ఎలా కేటాయిస్తారని ఆయన మండిపడ్డారు. మా తండాలో మేమే పాలకులుగా ఉండాలనే అంశంపై సుదీర్ఘకాలంగా పోరాటం సాగిందన్నారు. తండ పంచాయతీలను సాధించుకున్న తర్వాత ఇతర సామాజిక వర్గాలకు రిజర్వేషన్లను కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన హయంలో ఇలాంటి పరిణామాలకు పూనుకోవడం మంచిదికాదని పేర్కొన్నారు. తక్షణమే తమ విధానాలను మానుకుని గిరిజనుల అభ్యున్నతి కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో మోతీలాల్‌నాయక్, నందులాల్‌నాయక్, సురేష్, రాంబాబు, మాంజాజి నాయక్, లలితభాయి, బిట్టునాయక్, సుధాకర్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కోనాపురంలో ఆర్థిక సహాయం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తగూడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోనాపురంలో మృతుడి కుటుంబానికి ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ నాయకులు మంగళవారం ఆర్థికసాయం చేశారు. కోనాపురం గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ, 21వేలు ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు కర్ర జనార్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లం అయిలయ్య, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ కమిటీ అధ్యక్షుడు బోయినేని ప్రశాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుంజ భిక్షపతి, నాయకులు కడారి భాస్కర్‌రెడ్డి, బొల్లం ఉపేందర్, మెతుకు సంజీవరెడ్డి, బండారి అయిలయ్య, బొబ్బిలి వెంకటమల్లు, ముస్కు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రణీతమ్ సుహాస్‌కు సన్మానం



ప్రణీతమ్‌సుహాస్‌ను సన్మానిస్తున్న వివిధ సంఘాల బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ లోని ఓ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందిన బొడ్డుపల్లి ప్రణీతమ్ సుహాస్‌ను వివిధ సంఘాల బాధ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బొడ్డుపల్లి శ్రీనివాస్- మాధురి దంపతుల కుమారుడు ప్రణీతమ్ సుహాస్‌ను వారి నివాసంలో మంగళవారం సన్మానించారు. పట్టుదలతో చదివి ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని జిల్లా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు, ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య, మరిపెడ ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. ప్రణీతమ్ సుహాస్‌ను ఎంబీబీఎస్ సీటు సాధించేందుకు ప్రోత్సహించిన పెదనాన్న బొడ్డుపల్లి ఉపేందర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇనుగుర్తి సుధాకర్, తీగల రాజేందర్, రవి, పరందామయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

విశ్రాంత ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కూరపాటి వెంకటనారాయణ

తొర్రూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనాభాలో అధికులైన బీసీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని కేయూ విశ్రాంత ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. మంగళవారం తొర్రూరులోని విశ్రాంతి భవనంలో బీసీ సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లయినా రాజ్యాంగ, రాజకీయపరంగా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 1989లో బీసీ నాయకుల ఒత్తిడితో అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది.. కానీ బీజేపీ అప్పట్లో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం బీసీలకు సామాజిక, రాజకీయ న్యాయం చేయలేదని, తెలంగాణలో గత ప్రభుత్వం కూడా బీసీలను అణగదొక్కిందని, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేలా తీసుకువచ్చిన బిల్లుకు గవర్నర్ ఆమోద ముద్ర వేసేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో ఐకమత్యంతో బీసీ నాయకులను గెలిపించుకోవాలన్నారు. బీసీ సంఘాల నాయకులు చంద మల్లయ్య, కూరపాటి రమేష్, కె. వెంకటాచారి, బుచ్చిరాములు, అంజయ్య తదితరులు ఉన్నారు.

దివ్యాంగురాలికి ఆర్థిక భరోసా



దివ్యాంగురాలితో గంగావత్ రాంసింగ్‌నాయక్ తదితరులు

గార్ల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చంద్రగిరి గ్రామంలో నిరుపేద దివ్యాంగురాలికి రిటైడ్ ఆదాయపు పన్ను శాఖాధికారి గంగావత్ రాంసింగ్ నాయక్ మంగళవారం రూ 50 వేలు ఆర్థిక సహాయం అందించారు. గ్రామంలో ఆమె కిరాణా షాపును ప్రారంభించారు. తండాలో దుర్భర జీవితం గడుపుతున్న పేద కుటుంబానికి చేయూత నిచ్చి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా రాంసింగ్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అగాల రామారావు, యల్లంకి తిరుమలరావు, హసేన్ నాయక్, భీమ్ సింగ్, భూక్యా శ్రీను లచ్చు, సుధాకర్ పాల్గొన్నారు.

జేసీబీ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక



పురుషోత్తం, నాయక్

పెద్దవంగర, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జేసీబీ అసోసియేషన్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీరాం పురుషోత్తం, ప్రధాన కార్యదర్శిగా బానోత్ జేతరామ్, ఉపాధ్యక్షుడిగా గుగులోత్ పటేల్ నాయక్, కోశాధికారిగా దండుగల శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా భూక్య మహేష్, గుగులోత్ దేవా, జాటోత్ బాలాజీని ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి అందరి సహకారంతో పని చేస్తామని పురుషోత్తం అన్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి



ఫత్తేపురం గ్రామ సమీపంలో ధ్వంసమైన జాతీయ రహదారి



మాటేడు గ్రామ సమీపంలో ధ్వంసమైన జాతీయరహదారి

పట్టించుకోని అధికారులు

తొర్రూరు రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వరంగల్- ఖమ్మం జాతీయ రహదారి 365 పై పలు చోట్ల గుంతలు పడి ప్రమాదభరితంగా మారింది. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొర్రూరు నుంచి మహబూబాబాద్ వెళ్లే రోడ్డులో మడిపల్లి, ఖమ్మం వెళ్లే మార్గంలో ఫత్తేపురం గ్రామ శివారు, సమీపంలో రెండు చోట్ల, మాటేడు గ్రామ సమీపంలో భారీ గుంతలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వెల్లికట్టె, నాంచారిమడూరు గ్రామాల మధ్య రహదారి పై గుంతలు పడి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో రహదారిపై ఉన్న గుంతలు ఏర్పడక వాహదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరుతున్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ అండ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

కొత్తగూడ, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రయివేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎంఆర్‌ఎఫ్ భరోసాగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య పేర్కొన్నారు. కొత్తగూడ మండలంలో పలువురు బాధితులకు మంజూరైన రూ, 408000 సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య మంగళవారం కొత్తగూడలో అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్‌లు మంజూరు చేయించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, సిద్దబోయిన అక్కినారాయణ, భద్రయ్య, పాకాల స్వామి, సోలం వెంకన్న, అర్రెం స్వామి, యాదగిరి కిరణ్, అప్సర్, గణేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రెడ్యా పరామర్శ



గంధసిరి వెంకన్నను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బాధిత కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి రెడ్యానాయక్ పరామర్శించారు. పగిడిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గంధసిరి వెంకన్న గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ జిల్లా నాయకులు యండీ ఆయూబ్‌పాష, ధుండి మురళి, మంగీలాల్, భూపతి బాలమల్లు, చెక్కల శ్రీను, ఉప్పలయ్య, యాదగిరి, శ్రీకాంత్, సంతోష్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ అండ ..

కొత్తగూడ, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి) : కంచర్ల వెంకటయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి పేర్కొన్నారు. మండలంలోని రాంపూర్ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ కంచర్ల శ్రీనివాస్ తండ్రి వెంకటయ్య ఇటీవల మృతి చెందాడు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రాంపూర్ గ్రామ కమిటీ నాయకులు ఆర్థిక సహాయం చేశారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, డీసీసీ సభ్యుడు వీరనేని వెంకటేశ్వరరావు (లావణ్య వెంకన్న), మాజీ జడ్పీటీసీ కారెజు రమేష్, మండల నాయకులు ముస్కు వెంకన్న, ఈర్యా నాయక్, ఉపేంద్రచారి, గొంది రాజు, అజ్మత్ పాష, రాంటెంకి మల్లయ్య పాల్గొన్నారు.

అటు కుక్కల వేట.. ఇటు కోతుల గోల

(5వ పేజీ తరువాయి)

రావాలంటేనే జంకుతున్నారు. ఒక్కరు చేతిలో సంచి గాని, కవర్‌గాని పట్టుకుంటే వీధి వెంట నడిస్తే చాలు కోతులు వెంట పడి గాయపర్చి వాటిని లాక్కుంటున్నాయి. ఇక ఇంటి తలుపులు తీసి ఉంటే చాలు ఇళ్లలో చొరపడి వస్తువులను చిందర వందర చేసి తినుబండారాలను వెంట తెచ్చుకుంటున్నాయి. ఇకరైల్వే స్టేషన్‌లలో ప్లాట్ పారంలపై కోతులు తిరుగుతూ ప్రయాణికులు భయభ్రాంతులకి గురి చేస్తున్నాయి. మరో పక్క గ్రామాల్లో రైతులు వేసిన పంటలను ధ్వంసం చేయడంతో గ్రామ సమీపంలో ఉన్న భూములకు సంబంధించిన రైతులు వ్యవసాయం చేయడం మానివేశారు.

పాలకమండళ్లు లేక పట్టించుకునే వారు కరువు..

జిల్లాలో నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో 482 గ్రామ పంచాయతీలున్నాయి. గ్రామ పంచాయతీల కాల పరిమితి ముగిసి 20 నెలలు, మునిసిపాలిటీల పాలకమండళ్ల గడువు ముగిసి 8 నెలలు గడుస్తోంది. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులు లేక పోవడంతో ప్రత్యేకాధికారులను నియమించడంతో పల్లెలను పట్టించుకున్న నాధుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఇక కొన్ని గ్రామాల్లో కోతుల బెడద భరించలేక యువకులు, పెద్దలు ముందుకు వచ్చి కోతులను పట్టిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో రోజు రోజుకు పెరుగుతున్న కోతులు, కుక్కలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారు. వాటి నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

దుర్గామాత మండపాల వద్ద అన్నదానం



ఉయ్యాలవాడలో అన్నదానం చేస్తున్న నున్నా రమణ మిత్ర బృందం



అన్నదానంలో పాల్గొన్న సీఐ రవికుమార్ తదితరులు

బయ్యారం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేవీ నవరాత్రుల్లో భాగంగా బయ్యారంలోని రామాలయం, గాంధీ సెంటర్ దుర్గామాత మండపాల వద్ద నిర్వాహకులు మంగళవారం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రామాలయం వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని బయ్యారం సీఐ రవి కుమర్, ఎస్సై తిరుపతి, ఆలయ కమిటీ చైర్మన్ క్రిష్టారెడ్డి ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు విరివిగా పాల్గొన్నారు. కాగా మంగళవారం దుర్గామాత దేవి అమ్మవారు భక్తులకు దుర్గామాత ఆవతారంలో దర్శనమిచ్చారు.

● డోర్నకల్ : దుర్గాదేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని మంగళవారం డోర్నకల్ మండలం ఉయ్యాలవాడలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉయ్యాలవాడకు చెందిన ప్రముఖ వ్యాపారి నున్న రమణ మిత్రబృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి గంగాధర్, ఉయ్యాలవాడ మాజీ సర్పంచ్ తాళ్లూరి రామయ్య, మాజీ ఎంపీటీసీ నున్న మల్లికార్జున్, నున్న జగన్, నున్న చంద్రం, పోటు కుటుంబరావు, పెద్దినేని అంజయ్య, కోటేష్, తుమ్మల వీరన్న, హరిప్రసాద్, నాగరాజు, నాగయ్య, నున్న భారతి పాల్గొన్నారు.